102

# అంగిలోపోచ అటూ పోదు - ఇటూ రాదు

"మీకేం మహారాజులు. పెట్టిపుట్టినవాళ్ళు. ఎన్ని కబుర్లయినా చెబుతారు. మీతో మాట్లాడుతూ కూచున్నానుకోండి. కుండలుపోయిమీదికెక్కవు. కాబట్టి..." అని వాక్యం పూర్తి చెయ్యకుండానే వలను కాలువలోకి విసిరాడు- నూతక్కి గంగయ్య.

దూరంగా సరివిచెట్లు గాలి వీచినప్పుడల్లా, తలలు విరబోసుకుని గోల చేస్తున్నాయి. కాలవకు అవతల - పచ్చని తివాచీ పరచినట్లుగా పసుపు తోటలూ, వాటికికుడి వేపుగా కంకుల బరువుతో వంగిపోయి వరిపొలాలు, ఇంకా దూరంగా తాడిచెట్ల వరసా, ఉండి ఉండి రోడ్డును అదరగొడుతూ పరుగెత్తే లారీల రొదా, వీటి మధ్యనే వున్నా వీటన్నింటికీ అతీతంగా వలకేసి చూస్తూ కూచున్నాడు గంగయ్య.

అయిదారు నిముషాల తరువాత మెల్లిగా వలను లాగాడు. ముందుగా ఏమీ కనిపించలేదు. కుడిచేత్తో వలను లాగుతూ, ఆ లాగిన వలను మలిచి ఎడం చేతికి చుట్టుకుంటూ నెమ్మదిగా పైకి తీశాడు. బురదా, కంప, గొగ్గురురాళ్ళు, నత్తగువ్వలతో సహా రెండు దోసెళ్ళ చేపలు వలలో భలభలలాడుతూ కనిపించాయి. వాటిల్లోనూ చిన్న చిన్న చేపపిల్లలు వల కన్నాల్లోంచి దూకిపోయాయి. మిగిలిన వాటిని వొడ్డుమీద పోసి పైన గుడ్డను కప్పాడు గంగయ్య.

కాలవపక్కనే చిన్న గుడిశ గుడిశలోంచి తుగిడీలు తుగిడీలుగా పొగలేస్తున్నది. మోకాళ్ళ దాకా చీర దోపుకున్న అలివేలమ్మ సత్తుగిన్నెల్ని లొటలొటలాడిస్తున్నది.

"ఈ మధ్యనే పెళ్ళయింది. యింకా ఏడాది తిరగలా? అప్పుడే పిల్లాజెల్లా అంటారేంది బాబూ?" అన్నాడు గంగయ్య నవ్వుతూ.

దూరంగా కాలవలో ఈత కొడుతున్నవాడు తన బావమరిదని చెప్పాడు. అప్పను చూసిపోదామని రెండు రోజుల క్రిందట వచ్చాడట. తన మామగారు కూడా యిదేపని చేస్తాడట.

"మాది మొదట్నుంచీ ఈ వృత్తేనండి. మా అయ్య సముద్రం మీద చేపలు పట్టేవాడు. మాకో చిన్న డింగీ వుంది. అప్పుడప్పుడు మా అయ్యతో బాటు, నూనూ పోతూ వుండేవాణ్ణి మరీ దూరం పోతే, మంచి చేపలే దొరుకుతాయిగానండీ, పోవడానికి ధైర్యం కావాలి. మీలాంటి వాళ్ళకు నీళ్ళంటే భయంగానీ, మాకేం వుండదండీ. గంగమ్మ తల్లి మమ్మల్ని చల్లగానే చూస్తుంది" అన్నాడు గంగయ్య.

వాళ్ళ సంసారం మరీ ఉన్నదేమీ కాదు గానీ కటిక పస్తులు కూడా ఎప్పుడూ చెయ్యలేదు. సముద్రం ఒడ్డునే చిన్నగుడిశ. నాలుగైదు వలలు, తమకూ తమ చిన్నాన్నలకూ కలిసి ఓ చిన్న పడవా- ఇవీ తమ ఆస్తిపాస్తులన్నాడు.

"నేను ముందుగా గాలంతో చేపలు పట్టేవాణ్ని. చిన్న ఎరను గాలానికి గుచ్చి కాలవలోనో, కుంటలోనో వేసేవాణ్ని. ఎరకోసం చేపవచ్చి గాలానికి తగులుకుంటుంది. తెలిసేదెట్లానంటే గాలం తాడుకు, బెండుముక్క కడతాం గదండీ, చేప ఎరను నోటకరుచుకొని లాగుతుంది. లాగినపుడు బెండు మునుగుతుంది. మునగంగానే గాలాన్ని విసురుగా లాగేస్తా. చేప వొడ్డుకొచ్చి పడుతుంది. రోజంతా పట్టినా అరవీసెడు చేపలు పడవండి" అన్నాడు గంగయ్య.

కాలువలు బాగా పారుతున్నప్పుడు కాలువకు అడ్డంగా 'మావులు' పన్నుతాట్ట. ఆ మావుల్లో చేపలు చిక్కుకొంటాయట. వాటిని పోగేసుకొంటాడట. సాధారణంగా ఈమావుల్ని దాటుకుని చేపలు పోలేవని, మరీ చిన్నవీ, మరీ పెద్దవీ మావుల్లో పడవనీ గంగయ్య చెప్పాడు.

"వాలిగలు, జల్లలు, బొమ్మిడాయిలు ఎక్కువగా దొరుకుతాయండీ. యివి దొరికినంతగా రొయ్యలు దొరకవు. మిగిలినవాటికన్నా రొయ్యలకు మంచి ధర గిట్టుబాటవుతుంది" అన్నాడతను.

ఎండాకాలమప్పుడు, కాలువల్లో నీరుబాగా తగ్గి పోతుంది. అక్కడక్కడా మడుగులు ఏర్పడుతుంటాయి. ఈ మడుగుల చుట్టూ, ఎత్తుగా మట్టితో కట్టలు కడతారు మడుగులో వున్న నీరంతా కుండబొచ్చెలతో వొడ్డుకు చిమ్మేస్తారు. అప్పుడు మడుగులో వున్న చేపలన్నీ బయటపడతాయి. వాటిని పట్టుకుని, వొడ్డున పడేస్తారు. కొన్ని రకాల చేపలు, నీటిలో కాకుండా అడుగున మెత్తగా వుండే బురదలో కూరుకుపోయి వుంటాయని, వాటిని పట్టుకోవాలంటే బురదలోకి రెండు చేతులూ పోనిచ్చి బురదతో సహా బయటికి తీయవలసిందేనని గంగయ్య వివరించాడు.

"అయ్యా! ప్రాణమంటే, మనకుమల్లే వాటికీ భయమేనండీ, చిక్కకుండా పోదామని వాటి తంటాలు అవి పడుతూ వుంటాయి. అవి పారిపోకుండా మన బాధలు మనం పడతాం. కొన్ని కొన్ని చేపలు కొరుకుతాయి. గీరతాయి, రక్తం కారుతుంది. కాళ్ళూ చేతులూ గీరుకుపోతాయి.... నిజమే! అందుకని చేపలు పట్టపడం మానేస్తే బువ్వదొరుకుద్దా బాబూ" అని ప్రశ్నించాడు గంగయ్య.

జలగలు పట్టుకొంటాయని, అవి పట్టుకొన్నాయంటే, ఒక పట్టాన ఊడిరావని అన్నాడు.

"ఒడ్డుకొచ్చిందాకా జలగపట్టినట్టుగా తెలియదండీ, లాగామనుకోండి సాగుతుందిగానీ ఊడిరాదు. అటువంటప్పుడు జంగు సున్నం రాయాలి. అప్పటికప్పుడు సున్నమంటే దొరికిచావదుగదా. అందుకని చుట్టముక్కను కసాపిసా నమిలి ఆ ఉమ్మిని జలగమీద రాస్తేసరి. చుట్టలు చుట్టుకొని ఊడి కిందపడుతుంది. ఇక ఎండ్రకాయలసంగతి సరేసరి. గిట్టలతో వొత్తిందంటే బాబూ, నక్షత్రాలు తిరిగిపోతాయి. అప్పుడప్పుడు నీటి పాముల బాధ కూడా తప్పదండీ" అన్నాడు గంగయ్య.

అన్నోదకాలకు కొరతలేని దివిసీమలో వున్నా, ఈ రెండింటి కోసమూ, నానా అగచాట్లూ పడక తప్పడం లేదన్నాడు గంగయ్య.

"ఇంత పొలమో గిలమో ఉన్నవాళ్ళకు ఫరవాలేదనుకోండి. మాలాంటి అలగా జనం సంగతేముంది చెప్పండి? చేపలు పడతామనుకోండి. వాటిని అమ్ముకోవాలి గదా! ఊళ్ళో ఎన్నని అమ్ముతాం? ఎంత మందికని అమ్ముతాం? కావిడేసుకుని టౌనుకు తీసుకెళ్ళాల్సిందే. అంత దూరం తీసుకెళ్ళాక, కమిషనుదారు అడిగినంతకూ ఇవ్వాల్సిందే. నిలవవుండే సరుక్కాదాయె లేదు కూడదని వుంచామనుకోండి - రేపయినా అవి వాడికే అమ్మాలిగదా లేదా ఇంకో కమిషనుదారుకి అమ్మాలి.. వ్యాపారంలో వాళ్ళలో వాళ్ళకి ఎన్ని పోటీలున్నా మా దగ్గరి కొచ్చేసరికి, వాళ్ళంతా వొకటేండీ. 'సరుకు బాగాలేదంటారు' కొనే దిక్కులేదు పొమ్మంటారు. ఏదో దయతలచి కొన్నట్టు కొంటారు. ఏదో కాడికి అమ్ముకోవడం, ఆ డబ్బుల్తో ఉప్పు పప్పు నూనెగీనె కొనుక్కోవడం మామూలే. కావిడేసుకుని కొంపకు చేరడం... ఇదీ వరస. అల్లా కూడా బతక్కుండా భగవంతుడు మా కొంపలు కూల్చేశారు... ఆ తుఫానులలో మా వాళ్ళంతా చచ్చిపోయారు. నేనొక్కణ్నే తాటిచెట్టెక్కి బతికా" అన్నాడు గంగయ్య.

కట్టుపంచతప్ప, వంటిమీద ఇంకేమీ లేని గంగయ్యను ఎవరో దయామయుడు ఆదరించాడు.

“ఇంకా - ఆదేశం పోనండి. అయ్యా! అందరూ చచ్చిపోయారు. ఉన్న ఊరేమో దిబ్బేసుకు పోయింది. ఇక్కడికొచ్చిపడ్డా. ఈ కాలువలో చేపలు పడతా. సాయంకాలానికల్లా తెనాల్లో అమ్ముకొస్తా. ఆ గుడిసె నేనే సొంతగా వేసుకొన్నా. ఈ కాలవ మీద మేస్త్రీ అప్పుడప్పుడొచ్చి బెదిరిస్తుంటాడు. పావలో అర్ధో చేతిలో పెడతా. బెట్టెడు చేపలిస్తా వెళ్ళిపోతాడు.... సుఖమని అనబోకండి. ఇంతవరకూ పస్తులు చెయ్యలేదు బాబూ.

ఆ గీత రాసిపెట్టి ఉందనుకోండి. మీరూ నేను తప్పించలేంగదా!” అన్నాడు గంగయ్య వేదాంతిలాగా.

దివిసీమలో జరుగుతున్న పునర్నిర్మాణ కార్యక్రమాల గురించి అతను ఎవరో అంటుండగా విన్నాడట. మత్స్య పారిశ్రామికుల సహకార సంఘాల గురించి గానీ, వారి సంక్షేమం గురించిగానీ అమలు జరుగుతున్న పథకాల గురించి గానీ గంగయ్య కేమీ తెలియదు.

“ఏం చేస్తున్నారో, ఏం ఛస్తున్నారో నాకు తెలియదండి. అంతో ఇంతో చేసినా, అది నాలాంటి వాళ్ళదాకా రానే రాదండి. మధ్య వున్నోళ్ళు మింగడానికే సరిపోతుంది. పేరు మాది- నోరు వారిది” అన్నాడు గంగయ్య ఇంకోసారి వలను కాలువలో విసిరేస్తూ.